హైదరాబాద్ వార్త



# ఉందామా..పోదామా..!

- ప్రకాశ్‌గౌడ్ ఇంటికి మంత్రి పొన్నం ప్రభాకర్
- రాజకీయాలు లేవంటూనే బిఆర్ఎస్ నేతలతో మంతనాలు?

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నగరంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. దీంతో గులాబీ నేతల చూపు కాంగ్రెస్ వైపునకు డైవర్ట్ అవుతోంది. పార్టీ కోసమే పని చేస్తున్న గులాబీ సైనికులం అని ఇంతకాలం చెప్పుకు తిరిగిన నేతలంతా అధికారం కోల్పోవడంతో కండువాలు మార్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే నగర వ్యాప్తంగా కొంత మంది ప్రముఖ లీడర్లు కాంగ్రెస్ నాయకులతో టచ్‌లోకి వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంకొందరు లీడర్లు పార్టీ మారాలా..వద్దా..అనే అంతర్మథనంలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ నేతలకు గాలం వేయడం ప్రారంభించింది. గతంలో కాషాయదళం అనుసరించిన మేధావులు, విభిన్న రంగాల ప్రముఖులతో ముచ్చట్లు చందంగా ఇపుడు హస్తం పార్టీ కూడా మాజీలు, ప్రస్తుత ఎమ్మెల్యేలను కలుస్తోంది. ఇందులో భాగంగానే వివిధ శాఖల మంత్రులు, ఇన్‌ఛార్జిమంత్రులు తమతమ పరిధిలోని నాయకులను ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా మెలుగుతూ పార్టీలోకి లాగేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో గత ఎన్నికల్లో బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు మాత్రమే లభించాయి. గ్రేటర్‌పరిధిలో పార్టీని మరింత పటిష్ఠంచేయడంతోపాటు సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా తగినన్ని స్థానాలను కైవసం చేసుకునే లక్ష్యం ఒకటి, బిఆర్ఎస్‌ను గ్రేటర్ పరిధిలో మరింత నిస్తేజపరిచే విధంగా మరో వ్యూహంతో కాంగ్రెస్ వెళుతున్నదని ప్రస్తుత సమీకరణాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌కు ఇన్‌ఛార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్ఎస్‌యుఐ నుంచి అంచలంచెలుగా ఎదిగిన నాయకుడిగా రాజకీయాల్లో మంచి పట్టున్న ప్రముఖునిగా పొన్నంకు పేరుంది. ప్రత్యేకించి గ్రేటర్‌లో పార్టీకి కొండంత అండగా నిలిచే దిశగా ఆయన కసరత్తులు ముమ్మరం చేసారు. తన సొంత సామాజిక వర్గీయులకు ముందుగా ఎరవేస్తున్నారు. ఏదో ఒకమిషతో వారిని తానే స్వయంగా కలుస్తూ వారిని తనవైపునకు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసారు. ఇందులో భాగంగానే గురువారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను మైలార్‌దేవ్‌పల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. గౌడ సంక్షేమం కోసం చేయాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. గౌడ సంక్షేమ సంఘం సమావేశం ఈనెల 23వ తేదీ మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. గౌడ ధార్మికసంస్థ ఆధ్వర్యంలో దేవాలయాలవద్ద గౌడ భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. యాదాద్రిలో నిర్మాణం పూర్తి అయిన గౌడభవన్ పూర్తిస్థాయి సేవలందిస్తున్నదని, అలాగే వేములవాడ, శ్రీశైలం పలుచోట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు ఇద్దరి మధ్య చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. గౌడ సంక్షేమసంఘం బలోపేతానికి సమిష్టి కృషి అవసరమని ఈసందర్భంగా పొన్నం ప్రకాష్‌గౌడ్‌కు స్పష్టం చేసారు. కలయికలో ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యాలు లేవని పైపైకి చెపుతున్నా మంత్రి పొన్నం మాత్రం తన సామాజిక వర్గం నుంచే పార్టీలోకి లాగేందుకు గాలం వేస్తున్నారని పార్టీలోనే వినిపిస్తోంది. మంత్రితో పాటు మాజీ మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య, మైలార్‌దేవ్‌పల్లి మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్, హరిచరణ్‌గౌడ్, శ్రీనివాసగౌడ్, రాజుగౌడ్ తదితరులు వెంటవచ్చినా పొన్నం ఫోకస్ మొత్తం కూడా గ్రేటర్‌లో పార్టీకి ఓటుబ్యాంకును మరింత పటిష్ఠంచేసే దిశగానే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా ఇపుడు గ్రేటర్‌కు సరిహద్దుల్లో ఉన్న నియోజకవర్గాలపై ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మంత్రికి తన సొంత సామాజిక వర్గంలోనే కాకుండా ఇతర సామాజిక వర్గాల్లోకూడా మంచి మిత్రులు, స్నేహబంధం ఉంది. వాటిని పార్టీకోసం వినియోగించేందుకు పొన్నం ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లుతెలుస్తోంది.



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మైలార్‌దేవ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలుసుకొని సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్




# ఆకాశమే హద్దుగా..
# వింగ్స్ ఇండియా ప్రదర్శన

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త**

బేగంపేట్ ఎయిర్‌పోర్టులో 'ఇంటర్నేషనల్ వింగ్స్ ఇండియా 2024' వైమానిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ప్రారంభించగా, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏవియేషన్ రంగనిపుణులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో 130 ఎగ్జిబిట్‌లను ఉంచారు. దాదాపు 25 రకాల విమానాలు, హెలికాప్టర్లను ప్రదర్శించారు. 106 దేశాలకు చెందిన ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. కాగా ఈనెల 20, 21వ తేదీల్లో సందర్శకులకు అనుమతించనున్నారు. టికెట్ రూ.750గా నిర్ణయించారు. బుక్‌మై షో యాప్ ద్వారా టికెట్లను కొనుగోలు చేయవచ్చు. మూడేళ్లలోపు పిల్లలకు ఉచితం. ఈ ప్రదర్శనకు టికెట్ తీసుకొని వెళ్లినవారికి 30 అడుగుల దూరంలో బారికేడ్ల నుంచి మాత్రమే చూసే అవకాశం ఉంటుంది.





# తెలుగు రాష్ట్రాల నుంచి అయోధ్యకు స్పెషల్ ట్రైన్లు

- ఏర్పాట్లు పూర్తి చేసిన దక్షిణ మధ్యరైల్వే
- 29 నుంచి అందుబాటులోకి
- త్వరలో రిజర్వేషన్ విండో ఓపెన్

**హైదరాబాద్ జనవరి 18 ప్రభాతవార్త:**

తెలుగు రాష్ట్రాల నుంచి అయోధ్యకు వెళ్లాలనుకునే వారికి దక్షిణ మధ్య రైల్వే గుడ్ న్యూస్ చెప్పింది ఏపి,తెలంగాణ నుంచి అయోధ్యకు స్పెషల్ ట్రైన్లను నడిపేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే సిద్ధమైంది. జనవరి 29 నుంచి ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి మహూర్తం దగ్గరపడుతోంది. ఈ నెల 22న ప్రధాని బాలరాముడి కళ్లకు గంతలు విప్పి హారతిలో తొలిపూజ చేయనున్నారు. ఈ నెల 22 తరువాత అయోధ్య రామాలయానికి భక్తుల రద్దీ పెరుగనుంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో స్పెషల్ ట్రైన్లు నడిపేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే ఇప్పటికే ప్రణాళికలను రూపొందించింది. తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి అయోధ్య స్టేషన్‌కు ప్రత్యేక రైళ్ల రాకపోకలను సాగించనున్నాయి. జనగామ, కాజీపేట, పెద్ద పల్లి, రామగుండం, మంచిర్యాల మాదుగా రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్యరైల్వే ఏర్పాట్లను చేస్తోంది. అదేవిదంగా ఏపిలోని విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, సామర్ల కోట స్టేషన్ల నుంచి అయోధ్యకు స్పెషల్ ట్రైన్లను నడుపనుంది. విజయవాడ... అయోధ్య ట్రైన్లు... ఏలూరు, తాడేపల్లిగూడెం,రాజమహేంద్ర వరం, అనపత్తి,సామర్ల కోట, అన్నవరం, తుని, విశాఖపట్నం, విజయవాడ, శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ల మీదుగా అయోధ్యకు రాకపోకలను సాగిస్తాయని దక్షిణ మధ్యరైల్వే అధికారులు పేర్కొన్నారు. మరో వైపు టికెట్ల విషయంలో ఐఆర్‌సీటీసీ కీలక సూచన చేసింది. అయోధ్యకు డైరెక్ట్ రైళ్ల బుకింగ్స్ ప్రారంభం కాలేదని తెలిపింది.

**సికింద్రాబాద్....** అయోధ్య ప్రత్యేక ట్రైన్లు జనవరి 29,31, ఫిబవరి2,5,7,9,11,13,15,17,19,21,23,తేదీల్లో సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరుతాయని అధికారులు చెప్పారు. అయోధ్య నుంచి సికింద్రాబాద్‌కు ఆట్రైన్లు తిరుగు ప్రయాణం అవుతాయి. కాజీపేట నుంచి అయోధ్యకు జనవరి 30,ఫిబ్రవరి 1,3,6,810, 12,14,16,18,20,22,24,26,28 తేదీల్లో సాయంత్రం బల్దేరనున్నాయి. ఈ ట్రైన్లు అయోధ్య నుంచి తిరిగి కాజీపేట్ కు వస్తాయి. మరో వైపు ఏపీ నుంచి ఈ నెల 31న ఫిబ్రవరి 4న, ఫిబ్రవరి 7న స్పెషల్ ట్రైన్లు అయోధ్యకు నడుస్తాయి.

## బాలరాముడి కోసం అయోధ్యకు హైదరాబాద్ లడ్డు

అయోధ్యలో ప్రాణప్రతిష్ట వేడుకలు ప్రారంభమయ్యాయి. రామ భక్తులు తమ స్థాయికి తగ్గట్టు ఏదో ఒకటి బహుకరిస్తూనే ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ్ క్యాటరర్స్ 1265 కేజీల లడ్డూను అత్యంత భక్తి శ్రద్ధలతో తయారు చేసి ఆ రామయ్యకు కానుకగా ఇవ్వనున్నారు. 22న ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవాల్లో భాగంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వాహకులు లడ్డు తయారు చేశారు. దీన్ని 21వ తేదీ 10 గంటలకు అక్కడికి చేరవేసేందుకు ఏర్పాట్లు చేశారు. దాదాపు మూడ్రోజుల సమయం పట్టే అవకాశం ఉండటంతో తాజాగా ఉండేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సూచించిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తయారీదారులు తెలిపారు. అయోధ్య రామయ్యకు సమర్పించేందుకు హైదరాబాద్ లడ్డు శోభాయాత్రగా బయల్దేరింది. రాముడి గుడికి భూమిపూజ జరిగిన నాటి నుంచి ప్రాణ ప్రతిష్ట ముహూర్తం వరకు మొత్తం 1,265 రోజుల సమయం పూర్తవుతుంది. దానికి గుర్తుగా అంతే 12వందల 65 కిలోల భారీ లడ్డూను తయారికీ సికింద్రాబాద్‌కు చెందిన శ్రీరామ్ క్యాటరర్స్ వారు అనుమతి పొందారు. అందులో భాగంగా స్వామి వారికి నైవేద్యంగా సమర్పించేందుకు భారీ లడ్డు సిద్ధం చేశారు. మొదట్లో చిన్న లడ్డూ ఇద్దామనుకున్నామని, కానీ గుడి నిర్మాణం రోజు నుంచి ఓపెనింగ్ రోజు వరకు ఎన్ని రోజులు పడుతుంతో అన్ని కిలోల లడ్డు ఇవ్వాలని నిర్ణయించామని లడ్డు తయారీదారుడు నాగభూషణంరెడ్డి తెలిపారు. లడ్డూ చేయడానికి మొత్తం మూడు రోజులు పట్టిందని, దీనిని మొత్తం 28 మంది తయారు చేశారని తెలిపారు. ప్రధాని మోదీ రామజన్మభూమి పూజ చేసినప్పుడే గుడికి ఏమైనా ఇవ్వాలి అనుకున్నామని, మాది క్యాటరింగ్ కాబట్టి లడ్డూ ఇవ్వాలని అనుకున్నామని తెలిపారు.



# 20న నీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త**

హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరాచేస్తున్న కృష్ణా డ్రింకింగ్ వాటర్ సరఫరా మొదటి దశలో మిరాలం, అలియాబాద్ ఆఫ్‌టేక్ ప్రాంతం వద్దనున్న 1200 ఎంఎం దయా పిఎస్‌పిఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైనుకు జంక్షన్ పనులు చేపడుతున్నారు. చాంద్రాయణగుట్టలోని సన్ని గార్డెన్ నుంచి షోయబ్ హోటల్ వరకు చేపడుతున్న బాక్స్ డ్రెయిన్ పనులకు ఇబ్బందులు కలగకుండా ఈ జంక్షన్ పనులు చేస్తున్నారు. ఈ పనులు ఈనెల 20వ తేది శనివారం ఉదయం 6గంటల నుంచి 21వ తేది ఆదివారం ఉదయం 6గంటల వరకు జరుగుతాయి. ఈ నేపథ్యంలో 24 గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు. ఓ అండ్ ఎం డివిజన్ 1: మిస్త్రీగంజ్, బహుదూర్‌పురా, కిషన్‌బాగ్, జహనుమా, మొఘల్‌పురా, దారుల్ షిపా, సుల్తాన్‌షాహీ, పత్తర్‌ఘట్టి, అల్లుబైటీ కాలనీలు ఉన్నాయి. ఓ అండ్ ఎం డివిజన్ 2 పరిధిలోని అలియాబాద్, గౌలిపుర, తలబ్‌కట్ట, రియాసత్ నగర్ ప్రాంతాలు ఉన్నాయి

# ఎన్‌టీఆర్ విగ్రహానికి తెలుగు తమ్ముళ్ల నివాళి

-అమరజ్యోతి ర్యాలీని ప్రారంభించిన నందమూరి రామకృష్ణ,నందమూరి సుహాసిని



రసూల్‌పురా ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన అమరజ్యోతి ర్యాలీ.

**బేగంపేట జనవరి 18,ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి వేడుకలు రసూల్‌పురా జంక్షన్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఎన్‌టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌టీఆర్ అమర్ జ్యోతి ర్యాలీని ఎన్‌టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ,దివంగత నందమూరి హరికృష్ణ తనయ నందమూరి సుహాసినిలు రసూల్‌పురా జంక్షన్ నుంచి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎన్‌టీఆర్ ఘాట్ వరకు సాగింది. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎల్లప్పుడూ గుండెల్లో పెట్టుకుని చూసుకునే నాయకుడు తమ తండ్రి ఎన్‌టీఆర్ అని,ఆయనకు సంతానంగా పుట్టడం తాము చేసుకున్న అదృష్టమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రయాణిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన,కానూరి జయశ్రీ,ఎమ్.రాజు(నల్లగుట్ట),బోనాల శ్రీనివాస్‌గౌడ్,బొప్పన ప్రవీణ్,సోమలింగం,మురహరిగౌడ్,మల్లేష్,యాదగిరి,నందమూరి అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికులకు సరైన న్యాయం అందేలా అధికారులు కృషి చేయాలి

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:**

కార్మికులకు సరైన న్యాయం జరిగే విధంగా అధికారులు, సిబ్బంది తోడ్పాటును అందించాలని కార్మిక శాఖ కమిషనర్ కృష్ణఆదిత్య సూచించారు. కార్మిక శాఖ కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన కృష్ణఆదిత్యను రాష్ట్ర సహాయ కార్మిక శాఖ కమిషనర్‌ల సంఘం అధ్యక్షుడు బి.జసన్, కార్యదర్శి జిబిఎన్.స్వామి, కోశాధికారి యాదయ్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటరమణ, గౌరవ కార్యదర్శి చంద్రశేఖర్ కలిసిన వారిలో ఉన్నారు.



కార్మిక శాఖ కమిషనర్ కృష్ణఆదిత్యను కలిసిన రాష్ట్ర సహాయ కార్మిక శాఖ కమిషనర్‌ల సంఘం అధ్యక్షుడు బి.జాసన్ తదితరులు

# వాటర్ ట్యాంకర్ ఢీకొట్టగా... ఆర్టీసి బస్సు కిందపడి మహిళ మృతి

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త**

నగరంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎర్రగడ్డ పరిధిలోని భరత్‌నగర్ ఫ్లైఓవర్‌పై స్కూటీని వాటర్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో స్కూటీ నడుపుతున్న మహిళ కింద పడి పోయింది. ఆమె పై నుంచి ఆర్టీసి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలిని శ్రీశైలంకు చెందిన సునిత (26)గా గుర్తించారు. ఆమె కేపీహెచ్‌బీలో ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# కొత్త ట్రాఫిక్ రూల్స్..

- రోడ్డుపై పార్కింగ్ చేస్తే షాపులకు నోటీసులు
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- భారీ వాహనాలకు నిర్దేశిత సమయంలోనే రహదారుల మీదకు అనుమతి...
- రాంగ్ రూట్ డ్రైవింగ్‌తో యాక్సిడెంట్ కసులు : డిసిపి శ్రీనివాసరావు

**హైదరాబాద్ జనవరి 18 ప్రభాతవార్త**

సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు మాదాపూర్ జోన్ ట్రాఫిక్ ఇంచార్జ్ డిసిపి శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే ఉన్న నిబం ధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు ఉల్లంఘించిన వాహనదా రులపై కేసుల నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఈమేరకు గురువారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ ట్రాఫిక్ ఏడిసిపి శ్రీనివాసరెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏడిసిపి వేణుగోపాల్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసరావు మాట్లాడుతూ కమీషనరేట్ పరిధిలో భారీ వాహనాలు, డిసిఎం, వాటర్ ట్యాంకర్లు, ఆర్ఎంసి, జెసిబి, ట్రాక్టర్ వంటి ఎంఎంవి వాహ నాలకు ఉదయం 7.30 నుంచి 11.30 వరకు, సాయంత్రం 4.00 గంటల నుంచి రాత్రి 10.30 వరకు రహదారులపై ప్రయాణించడం నిషేదమని అన్నారు. నిర్మాణ సామాగ్రి, డెమాలిషన్ వాహనాలు రాత్రి 10.30 నుంచి ఉదయం 6 గంటల మధ్య మాత్రమే ప్రయాణానికి అనుమతి ఉందన్నారు. అన్ని భారీ, గూడ్స్, నెమ్మదిగా కదిలే వాహనాలకు ఫ్లైఓవర్ల మీద ప్రయాణం నిషేదమని, వారు కింద ఉన్న సర్వీసు రోడ్డును ఉపయోగించుకోవాలని సూ చించారు. నిషేదిత సమయాల్లో వాహనాలు రోడ్ల మీదకు వస్తే కఠిన చర్యలు తప్పవని, మొదటిసారి జరిమానా విధించి వదిలేయడంతో పాటు మరోసారి దొరికితే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఈ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల మీద 11,007 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వారాంతాల్లో వాణిజ్య సముదాయాల ముందు వాహనాలను నిలిపితే సదరు వాణిజ్య సముదాయాల మీద కేసులు నమోదు చేస్తామని, ఇప్పటికే కొన్నింటిని గుర్తించి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. సైబరాబాద్ పరిధిలో మొత్తం 55 పిలికాన్ సిగ్నల్స్ ఉన్నాయని, రోడ్డు దాటేవారు పిలికాన్ సిగ్నల్స్, పాద చారుల వంతెనలు వద్దే రోడ్డుదాటి ప్రమాదాల నుంచి రక్షించుకోవాలని సూచించారు. కమీషనరేట్ పరిధిలో మొత్తం 34 బ్లాక్‌స్పాట్ యాక్సిడెంట్ జోన్లను గుర్తించినట్లు తెలిపారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, రవాణా వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించి, నిబంధనల మేరకు వాహనాలు నడుపాలని తెలిపారు. విద్యాలయాలు, ఆర్‌టిసి బస్సుల డ్రైవర్లు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపి యాక్సిడెంట్ చేస్తే ఐపిసి సెక్షన్ 304(2) కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఫుట్‌పాత్‌లను అక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తప్పవని, ప్రతివారం త్రిపుల్ రైడింగ్, బ్లాక్ ఫిల్మ్, సిగ్నల్ జంపింగ్, అక్రమ పార్కింగ్ వంటి నిబంధనల ఉల్లం ఘనల మీద స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబరు 31వ తేదీన సైబరాబాద్ పరిధిలో ఒక్కరోజే 1300 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, గతవారం రోజులుగా 2వేల రాంగ్ రూట్ కేసులు నమో దు చేయడం జరిగిందన్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసరావు

### సూరారం రాజీవ్ గృహకల్పలో మాజీ కార్పొరేటర్ పాదయాత్ర

**జీడిమెట్ల, జనవరి 18, ప్రభాతవార్త**

సుభాష్‌నగర్ డివిజన్ ఆర్‌జికె సూరారం కాలనీ 100వ బ్లాక్ సముదాయంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలపై మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాదయాత్ర చేస్తున్న ప్రాంతాల్లో అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**జీడిమెట్ల, జనవరి 18, ప్రభాతవార్త**

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేసే కారణంగా జీడిమెట్ల ప్రాంతంలోని ఆటో స్టాండ్ బస్టాప్, సోమవారం మార్కెట్, వసంత టూల్స్ యూనిట్ 2, చిన్న శివాలయం ప్రాంతం, పోచమ్మ దేవాలయం ప్రాంతం, పెద్దమ్మ దేవాలయం రోడ్, పైప్‌లైన్ రోడ్, రమావతి స్కూల్ రోడ్ ప్రాంతాలలో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కెవి జీడిమెట్ల ఎస్ఎస్4 నుండి వెలువడే 1.11కెవి ఆటోస్టాండ్ ఫీడర్‌లోని విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు జీడిమెట్ల విద్యుత్ అధికారిని ఏఈ పి.ప్రసూన తెలియజేశారు. వినియోగదారులకు సహకరించాలని కోరారు.

### మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం..

**నిజాంపేట్, జనవరి 18, ప్రభాతవార్త**

నేడు ప్రగతినగర్‌లో విద్యుత్ మరమ్మత్తు కారణంగా 11 కెవి డాక్టర్స్ కాలనీ కేబుల్ ఫీడర్ 33/11 కెవి అలీప్ ఎస్ఎస్ పరిధిలో చెట్ల కొమ్మలను కత్తరించడం వల్ల మున్సిపల్ కార్యాలయం, 60 అడుగుల రోడ్డు, బాప్టిస్ట్ చర్చి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడి పాఠశాల, తిరుమల ఫర్నిచర్, జూడియో మాల్ ప్రాంతాల్లో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ప్రగతినగర్ విద్యుత్ ఏఈ దేగ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

**విద్యుత్ తాత్కాలికంగా నిలిపివేత..**

నేడు విద్యుత్‌శాఖ మరమ్మతుల కారణంగా మెయింటెనెన్స్ పనుల కోసం 33/11 కెవి మైటాస్ ఎస్ఎస్ నుండి వెలువడే 11 కెవి కెఎన్ ఆర్ ఫీడర్‌లో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కెఎన్ఆర్ కాలనీ, గాయత్రి టవర్స్, డీమార్ట్ ప్రాంగణం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిజాంపేట్ విద్యుత్ ఏఈ తెలిపారు.

### హరినగర్‌లో అల్లర్లలో గాయపడ్డ వారిని పరామర్శించిన ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, జనవరి 18, ప్రభాతవార్త**

శాంతి భద్రతలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అవుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల హరినగర్ బస్తీలో కొంత మంది వేరే బస్తీలకు చెందిన అల్లరి మూఖలు కొంత మంది యువకులపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు గురువారం హరినగర్ బస్తీలో గాయపడిన వారిని కలిసి వివరాలు అడిగి తెలుసుకుని వారిని పరామర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఇలాంటి గొడవలు ఎపుడు జరగలేదని ప్రస్తుతం దాడులు అధికంగా జరుగుతున్నాయని పోలీస్ వ్యవస్థ బస్తీలలో ప్రత్యేక నిఘా ఉంచి అల్లరి మూఖలను అదుపు చేయాలన్నారు. దాడి చేసిన అల్లరి మూఖలను వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, నియోజకవర్గం బీసి సెల్ అధ్యక్షులు నాగుల సత్యం, హరినగర్ బస్తీల అధ్యక్షులు నర్సింహ, ఎస్సై హరీష్, పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఎన్‌సిసి ఇన్‌స్ట్రుమెంట్ల అందజేత

**యూసుఫ్‌గూడ, జనవరి 18, ప్రభాతవార్త**

విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాలలో ప్రోత్సహించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.నవీన్ యాదవ్ అన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఎన్‌సిసి ఇన్‌స్ట్రుమెంట్లను సంక్రాంతి వేడుకల్లో భాగంగా గాలిపటాలను అందజేశారు. తమకున్న దానిలో కొంత పేద విద్యార్థులకు సహాయం చేయడం వలన తమకెంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు.

### సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలి



వినాయకనగర్ బస్తీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ, జనవరి 18, ప్రభాతవార్త :**

ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ఎస్‌పిఆర్‌హిల్స్, వినాయక నగర్, ఇందిరా నగర్ ఫేస్ 1లో వాటర్ వర్క్స్ మానేజర్ రాజేందర్, జిహెచ్ఎంసి వర్క్ఇన్స్‌స్పెక్టర్ వనీధర్‌తో కలిసి బస్తీలలో పర్యటించారు. ఈసందర్భంగా ఎన్నో ఏళ్లుగా బస్తీలలో పెండింగ్‌లో ఉన్న మంచి నీటి సమస్య డ్రైనేజి సమస్యలను వివరించారు. తొందరలోనే పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు ఎక్బాల్, వినాయక నగర్ బస్తీ అధ్యక్షులు సింగారి శ్రీనువాస్, కేశవులు, మన్సూర్, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**సంజీవరెడ్డినగర్ :** ఎర్రగడ్డ, భరత్‌నగర్ ఫ్లైయవర్‌పై ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కూటిపై వెలుతున్న యువతిని వెనుక నుంచి వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఓ యువతి మృతి చెందింది. వివరాలలోకి వెళితే స్కూటిపై వెళుతున్న సునీత(26)ని వాటర్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఇదే సమయంలో ఆర్టీసీ బస్సు ఆమె మీద నుంచి వెళ్ళడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన యువతి ఏపికి చెందిన సునీతగా గుర్తించారు. నగరంలో ఓ ప్రవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. ఎర్రగడ్డ నుంచి కూకట్‌పల్లి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

**కంటోన్మెంట్, జనవరి 18 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ మహిళా డిగ్రీ,పిజి కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించింది. ఈ నెల 10,11 తేదీల్లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ పర్ టీమ్ సభ్యులు సందర్శించి కస్తూర్బాగాంధీ కళాశాలకు ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చినట్లు ఈ నెల 17న ప్రకటించారు. దీంతో గురువారం కళాశాల ప్రాంగణంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఐక్యూఏసి చైర్ పర్సన్ డాక్టర్ ఆర్.రాజశ్రీ చైర్మన్ జి.ఆర్.అశోక్,కార్యదర్శి మహ్మద్ ఫయిముద్దీన్, సంయుక్త కార్యదర్శి సురేశ్ కుమార్,కోశాధికారి డాక్టర్ శైలజ రాజులు సంతోషం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ జి.సునంద, కళాశాల సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.



న్యాక్ ఏ గ్రేడ్ వచ్చినందుకు మారేడ్‌పల్లి కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలలో సంబరాలు జరుపుకుంటున్న

## సంక్షేమం,అభివృద్ధితో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేద్దాం : ఎమ్మెల్యే కెపి వివేకానంద

**జీడిమెట్ల, జనవరి 18, ప్రభాతవార్త**

125 గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్, చంద్రబోస్ నగర్, రోడామేస్త్రి నగర్ బి, ఎన్‌టిఆర్ నగర్ బి, బేకరి గడ్డ, శ్రీరామ్‌నగర్ ఏబి, ఎన్‌టిఆర్ నగర్ ఏ, దర్బార్ మైసమ్మ బస్తి, ఎంఎఫ్ ఫంక్షన్ హాల్ (శ్రీరామ్ నగర్), లెనిన్ నగర్ గడ్డ, ఉమాదేవి నగర్, అంబేద్కర్ నగర్, చంద్రగిరి నగర్, పెంటయ్య బస్తి, ఇంద్రనగర్ ఏబి, ప్రకాశం పంతులు నగర్, భవాని నగర్, ప్రొఫెసర్ జయశంకర్ నగర్, చిత్తారమ్మ దేవినగర్, పీఎం రెడ్డి నగర్, సుందరయ్య నగర్ బస్తీలలో గురువారం ఎమ్మెల్యే కెపి వివేకానంద కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ళలో చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నాపై నమ్మకం, ప్రేమతో ఇంతటి అఖండ విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపేందుకు ఈ కృతజ్ఞత యాత్రను చేపట్టడం జరిగిందన్నారు. మీరు అందించిన ఈ విజయంతో మరింత బాధ్యతగా మరింత అభివృద్ధి చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు విజయరాంరెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు అంజన్‌గౌడ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, రసీద్ బేగ్, చిన్నా చౌదరి, దాసారం లక్ష్మణ్, ఉపేందర్, గోవర్ధన్‌రెడ్డి, నవాబ్‌భాయ్, రాధాభాయ్, షకీర్‌భాయ్, అబ్బు, హమీద్, సుజాత, ఊర్మిళ, శ్రీరామ్‌నగర్ ఏ ప్రాంత వాసులు, సుభాష్ చంద్రబోస్ నగర్ వాసులు, ఎన్‌టిఆర్ ఏ, బి వాసులు, బేకరీగడ్డ వాసులు, శ్రీరామ్‌నగర్ ఏ, లెనిన్‌నగర్, ఉమాదేవి నగర్, అంబేద్కర్ నగర్, చంద్రగిరి నగర్, పెంటయ్య నగర్ ఇందిరానగర్, ప్రకాశం పంతులు నగర్ పిఎం రెడ్డి నగర్ వాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న స్థానిక ప్రజలు

## నార్సింగి పీఎస్ పరిధిలోని రోడ్లపైకి భారీ వాహనాలకు నో ఎంట్రీ

### - ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి



నార్సింగి ట్రాఫిక్ పిఎస్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ విధుస్తున్నట్లు డ్రైవర్లకు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి

**నార్సింగి, జనవరి 18 ప్రభాతవార్త :**

నార్సింగి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని రోడ్లపై భారీ వాహనాలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరిధిలో శిక్షార్హులవుతారని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం పలు భారీ ట్రక్కులు, వాహనాలను ఆపి, డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఉదయం 7.గంటల నుంచి 11:30.గంటల వరకు సాయంత్రం 4.గంటల నుంచి రానరతి 10.గంటల వరకు ఆర్ఎంసిలు, డిసిఎంలు, లారీలు, ట్రక్‌లు, గూడ్స్ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. టిప్పర్లు రాత్రి పదిన్నర గంటల నుంచి ఉదయం ఆరు గంటల లోపు మాత్రమే నడుపుకోవాలని సూచించారు. రోజు రోజుకు ఈ రోడ్లపై ట్రాఫిక్ సమస్య పెరుగుతుండడం వల్లనే సైబరాబాద్ పోలీసు కమీషనర్ ఈ ఆదేశాలను జారీ చేశారని, వాహనదారులంతా వీటిని ఖచ్చితంగా పాటించాలిన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై ఎంవిఐ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 01.జనవరి నుంచి 17.జనవరి వరకు డిసిఎంలు-911, ఆర్ఎంసిలు, లారీలు, ట్రిప్పర్లు-1658.పై కేసులు నమోదు చేశామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్‌రెడ్డి వివరించారు.

### టిఎస్‌బిసిఎల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీల కష్టానికి తగిన ఫలితం అందే విధంగా కృషి : దామోదర్‌గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 18, ప్రభాతవార్త**

రాష్ట్రంలో టిఎస్‌బిసిఎల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీల కష్టానికి తగిన ఫలితం అందేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలంగాణ రాష్ట్ర రెస్టారెంట్ అండ్ బార్ లైసెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ హామీ ఇచ్చారు. టిఎస్‌బిసిఎల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీలు డిపోలోని స్టాకును వైన్ షాపులకు, బార్లకు, పబ్బులకు సరఫరా చేస్తే ఒక కాటన్ లోడ్‌కు అయిదు రూపాయలే ఇస్తూ వచ్చారు. దీనిని ఏడు రూపాయలకు పెంచాలని వారు గత రెండు నెలలుగా డిమాండ్ చేస్తువచ్చారు. హమాలీలతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఒకలోడు సరుకుకు ఐదు రూపాయల నుండి ఆరున్నర రూపాయలకు పెంచుతున్నట్లు అసోసియేషన్ సభ్యులు హమాలీలతో ఒప్పందం చేసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ హమాలీలు పగలనకా రాత్రనకా ఎంతో కష్టపడుతున్నారని వారి కష్టానికి గుర్తించి ఒక కాటన్ లోడుకు ఆరున్నర రూపాయలు పెంచడానికి ఈరోజు ఒప్పందం చేసుకున్నామన్నారు. తదనుగుణంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని 8 డిపోలలో బార్లు, రెస్టారెంట్లు, పబ్బులు నిర్వాహకులు పెంచిన రేటును ఈ నెల 20 నుండి హమాలీలకు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ ఒప్పందము రెండు సంవత్సరాల వరకు కొనసాగుతుందని, దీని ప్రకారం హమాలీలు డిపో లైసెన్స్ దారులను ఛాయికి గానీ మరే ఇతర అవసరాలకు డబ్బులు అడిగినచో ఈ ఒప్పంద పత్రాన్ని డిపో మేనేజర్స్ సమక్షంలో క్యాన్సల్ చేయడం జరుగుతుందని వారు మీడియా ముఖంగా తెలిపారు.

### దేవాలయాల స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి : మురళీధర్‌రావు

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 18, ప్రభాతవార్త**

అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను శుభ్రం చేయాలని దేశ ప్రజలను భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు జనవరి 22నాటికి దేశంలోని అన్ని పుణ్య క్షేత్రాలు, దేవాలయాలను శుభ్రం చేయాలని, స్వచ్ఛతా ప్రచారాన్ని నిర్వహించాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర బిజెపి వ్యవహారాల ఇంచార్జీ మురళీధర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో అసెంబ్లీ పరిధిలోని కెపిహెచ్‌బి రోడ్ నెంబర్ 3, శివాలయం ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళీధర్‌రావుకి కాంతారావు ఘనస్వాగతం పలికిన బిజెపి శ్రేణులు, స్వచ్ఛ అభియాన్ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పీవీ శ్రీరమణ ఇరువురికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ 500 ఏళ్ళ పోరాటం తరువాత జనవరి 22న రామ మందిరాన్ని పున:నిర్మాణం చేసుకోవడం శుభసూచకమని రామ జన్మభూమి అయోధ్యలో భవ్య రామమందిర ప్రారంభోత్సవానికి ముందు భారతదేశంలోని అన్ని ఆలయాలు పరిశుభ్రంగా ఉండాలని, మకర సంక్రాంతి నుండి జనవరి 22వరకు ఈ స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టాలన్న మోడీ దేశప్రజలను కోరారు. మోది పిలుపును కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ సంస్థ ఆచరణలో పెట్టడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ కమిటీ సభ్యులు వినోద్, రవి, సూరిబాబు, ఆర్ఎస్ఎస్, విహెచ్‌బి సభ్యులు, హిందూ బంధువులు, కాలనీవాసులు, ఆలయ సభ్యులు పాల్గొన్నారు.

### భారత దేశ సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవి : మాధవి లత



కార్యక్రమంలో పాల్గొన్న లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవి లత, మాజీ కార్పొరేటర్ రేణు సోనీ

**చార్మినార్, జనవరి 18 ప్రభాతవార్త :**

భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవిలత అన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ట మహోత్సవం జరుగుతున్న సందర్భంగా లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవిబాగ్ మందిరంలో శ్రీ సీతారామ కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవి లత, డాక్టర్. సరితా అగర్వాల్, మాజీ కార్పొరేటర్ రేణు సోనీ, సీతాంశు వ్యాస్, మోనిక వ్యాస్, నవరతన్, లలితా ఇందోరియా, బాల ప్రసాద్, శ్వేత శర్మ, నేపాల్ సింగ్, లతా కుంటల్, జ్యోతి, అశోక్, గాయత్రి రెడ్డి దంపతులు పలువురు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, జనవరి 18 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు నలందనగర్, లోటాస్ స్కూల్ స్కూల్, న్యూఫ్రెండ్స్ కాలనీ, శ్రీశాంత్ పార్కు, 12 నుంచి 2 గంటలు వరకు సంజీవిని హిల్స్, నలందనగర్, సిరిమల్లె నగర్ఎజి కాలనీ, 3 నుంచి 5 గంటలు వరకు కేశవనగర్, క్రిష్ణానగర్, శివానగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మాస్ కొండాకాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అష్ఫల్ తెలిపారు.

### గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆన్‌లైన్ సంగీత పోటీలు

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:**

శ్రీసాయిశృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆన్‌లైన్ సంగీత పోటీలను నిర్వహించాలని నిర్ణయించినట్లు అకాడమి డైరెక్టర్ వసుధామూర్తి, అకాడమి ప్రిన్సిపాల్ లక్ష్మణమూర్తి వివరించారు. సబ్ జూనియర్ 5 నుంచి 10 సంవత్సరాలు, జూనియన్ 11 నుంచి 20 సంవత్సరాలు, సీనియర్స్ 21పైబడిన వారు ఈ పోటీలలో పాల్గొనవచ్చని, ప్రైవేట్ దేశభక్తి గీతాలు పాడి వీడియోరికార్డింగ్ చేసి పంపించాల్సి ఉంటుందని, పోటీల్లో పాల్గొన్నవారందరికి దృవీకరణపత్రాలు ఇవ్వడంతో పాటు విజేతలకు ప్రత్యేక అవకాశాలను కల్పిస్తామన్నారు. దేశభక్తి చాటుకోవడానికి ఇది ఒక మంచి అవకాశమని, ఎలాంటి వయోపరిమితి లేకుండా అన్ని వయస్సు వారికి పాడే అవకాశం ఉందన్నారు.

### కాంగ్రెస్ పార్టీ తార్నాక డివిజన్ అధ్యక్షుడిగా బ్రహ్మాజీ



ఆదం సంతోష్‌కుమార్ చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకుకుంటున్న బ్రహ్మాజీ

**హైదరాబాద్ జనవరి 18 ప్రభాతవార్త:**

తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా లాలాపేట్‌కు చెందిన సీనియర్ నాయకుడు బ్రహ్మాజీ నియమితులయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్ నియామకపు పత్రాన్ని అందజేయగా సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తనకు పదవి రావడానికి కృషి చేసిన ఆదం సంతోష్ కుమార్, అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్‌లకు కృతజ్ఞతలని బ్రహ్మాజీ చెప్పారు. డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయిక మిటీ మెంబర్లను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బ్రహ్మాజీ పేర్కొన్నారు.

### ప్రగతి మహావిద్యాలయంలో ఘనంగా స్వర్ణోత్సవాలు ప్రారంభం

**అఫ్జల్‌గంజ్, జనవరి 18ప్రభాతవార్త:** గుజరాతీ ప్రగతి సమాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నమహోన్నతమైన విద్యాసంస్థలో విద్యను అభ్యసించడం విద్యార్థుల అదృష్టమని సుల్తాన్‌బజార్‌అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ ఏ.బాలగంగిరెడ్డి అన్నారు. గురువారం గుజరాతీ ప్రగతిసమాజ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రగతి మహా విద్యాలయ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఎసిపి ఎ.బాలగంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతవ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును గొప్పగా ఉండాలని కోరుకుంటారన్నారు. విద్యాబోధనలను నేర్చుకుని జీవితంలో విద్యభోదనలను అందించిన గురువులు, విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గుజరాతీ ప్రగతి మహావిద్యాలయ ఉత్సవాల ఛీప్ ప్యాట్రన్ మహేష్‌పటేల్ మాట్లాడుతూ ప్రగతి సమాజ్ సామాజిక కార్యక్రమాలతోపాటు, విద్యారంగంలో ముందు వరుసలో ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సమాజ్ అధ్యక్షులు గోవింద్‌దాస్‌షా, కార్యదర్శిరాహల్ చేడా, జాయింట్ సెక్రటరీ, డిగ్రీకాలేజ్ కరస్పాండెంట్ గోపాల్‌పటేల్, జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ జితేన్‌మజేథియా, కోశాధికారి అంబాలాల్ పటేల్, భారతీబెన్‌పటేల్, రాజేష్‌షా, ఘన్‌శ్యామ్‌పటేల్, ప్రిన్సిపల్ డాక్టర్. ఏ.మాధవిలత, పి.జి డైరెక్టర్ డాక్టర్ వై.కె.నాయుడు, ఎన్.సి.సి అధికారి టి.పి.సింగ్‌లతోపాటు అధ్యాపకులు, విద్యార్దులు పాల్గొన్నారు.

### ముషీరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:**

ముషీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షురాలు బోనం ఊర్మిల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించబోతున్నారు. ఇందులో భాగంగా ముగ్గుల పోటీలలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరుతూ జవహర్‌నగర్, గాంధీనగర్‌లో మహిళలను కలిసి ఆహ్వానించే కార్యక్రమం గురువారం జరిగింది. 21న ముషీరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని, పద్మశాలి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నిర్మల, స్వరూప, గీత, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

### మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలి

**-పల్లవి విద్యాసంస్థల అధినేత విజ్ఞప్తి**

**కంటోన్మెంట్, జనవరి 18 ప్రభాతవార్త:**

మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున అధిష్ఠానం పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలని బీజేపీ అధిష్టానాకి విద్యావేత్త, పల్లవి విద్యాసంస్థల చైర్మన్ మల్క కొమురయ్య విజ్ఞప్తి చేశారు. మహేంద్రహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లవి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరిట హైదరాబాద్ నగరం, శివార్లలలో చాలా సంవత్సరాలుగా విద్యాసంస్థలు నడుపుతున్నానని, లక్షలాది మంది విద్యార్థులు తమ విద్యాసంస్థల ద్వారా ఎదిగారని చెప్పారు. నిర్మాణ రంగంలో సైతం అపార అనుభవం ఉన్న తాను ప్రధాని నరేంద్రమోదీ సిద్ధాంతాలు, పాలనాధ్యక్షతకు ఆకర్శితుడి నాయ్యనని తెలిపారు. తనకు టికెట్ వచ్చినా, రాకపోయినా మల్కాజ్‌గిరితో పాటు తెలంగాణలోని అన్ని లోక్‌సభ సీట్లలో కమలం పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కొమురయ్య పేర్కొన్నారు.


IN THE COURT OF THE HON'BLE
XI JUNIOR CIVIL JUDGE,
CITY CIVIL COURT:
AT : SECUNDERABAD
O.S.No. 983 of 2023

Between:
1) **Pusa Sabitha** W/o Late Pusa Sailu, 47 yrs, Occ: Govt Employee
2) **Pusa Shalini** D/o Late Pusa Sailu, Aged 22 yrs, Occ: Student
3) **Pusa Maneesh** S/o Late Pusa Sailu, Aged about 42 yrs, Occ: Student
All are R/o H.No.10-4-A/191, Sastri Nagar, Tukaramgate, Near Mandal Office, Secunderabad, Nehrunagar, Hyderabad. TS-500026 ...**Plaintiffs**
And
1) **The Tahsildar,** Marredpally Mandal, Addagutta, Secunderabad.
2) **All Concerned ...Defendants**
To,
**All Concerned ...2nd Defendant**
Please take notice that the above named/Plaintiffs filed the above suit for Declaration, to declare the Plaintiffs as legal heirs of the deceased Pusa Sailu son of Pusa Mallaiah. The said suit stand posted to **19.01.2024.** If any person/s is/are claiming to be the legal heirs of the said deceased Pusa Sailu, or having any objection in granting the said relief, may appear before the said court on the above date at 10.30 a.m. and submit your contentions/ objections through documentary evidence. Failing which, the matter will be heard and decided exparte.
(By Order of the Court)
**M. PUSHPA VENI**
**J. MADHU**
**Advocates**
Hyderabad
**Counsels for Plaintiffs**


## గాంధీఆస్పత్రికి రూ. 50 లక్షల విలువ చేసే సామాగ్రిని అందజేసిన పూర్వ విద్యార్థి



గాంధీఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావుకు రూ. 50 లక్షల విలవచేసే సామాగ్రిని అందజేస్తున్న దినేశ్ అనిరెడ్డి

**సికింద్రాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అమేరికా అధ్యక్షుడు వైద్యుడు డాక్టర్ దినేశ్ అనిరెడ్డి గాంధీ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రూ. 50లక్షల విలువచేసే వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావు, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ పి. శ్రవణ్‌కుమార్‌లు ఆయనను సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు మాట్లాడుతూ తాను చదువుకున్న కాలేజీ, ఆస్పత్రికి విలువైన వైద్య పరికరాలు అందజేసి దినేశ్ అనిరెడ్డి పూర్వ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రొఫెసర్ పి. శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో కూడా పలుమార్లు ఇండియా వచ్చే సమయంలో ఆయన తనకు ఫోన్‌చేసి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాని అవసరమైన సామాగ్రి గురించి అడుగుతారని, అమెరికాలో కొనుగోలు చేసి విమానంలో ఎంతో బరువైన, విలువైన సామాగ్రిని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ సుంకం చెల్లించి గాంధీఆస్పత్రికి ఇవ్వడం ఎంతో అభినందనీయమని అన్నారు. దాత దినేశ్ అనిరెడ్డి మాట్లాడుతూ తాను అమెరికా వెళ్లాక సేవాభావం కలిగిన మిత్రులతో కలిసి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యా, వైద్య, వ్యవసాయం, నైపుణ్య శిక్షణ రంగాలలో తాము తెలంగాణలో అనేక సామాజిక సేవా కార్యాక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పరు. తాను చదువుకున్న గాంధీ వైద్య కళశాల తనకు మాతృ సంస్థలాంటిదని, వేలాదిమంది నిరుపేదలకు తమ సంస్థ చేసిన పరిశోధన వివరాలను త్వరలో తాము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు ఎం. రాజేశ్వర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి వినీల్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజీవ్‌గాంధీ క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024 ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పొన్నం ప్రభాకర్. చిత్రంలో వి.హెచ్.రోహిత్ చౌదరి తదితరులు

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:**

అంబర్‌పేటలోని వాటర్ వర్క్స్ గ్రౌండ్‌లో సిఎఫ్ఐ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో 43వ ఆల్ ఇండియా రాజీవ్‌గాంధీ అండర్-19 (డి/ఎన్) ట్వాంటీ-20 లీగ్ క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలను గురువారం రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌కు క్రీడాకారులు, కళా బృందాలు ఘనంగా స్వాగతం పలికాయి. రాజీవ్‌గాంధీ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్న వి.హనుమంతరావుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా గ్రామీణ ప్రాంతం నుంచే క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని పొన్నం చెప్పారు. ఉదయాన్నే లేచి ఎవరికి ఏ సమస్య ఉన్నా తీర్చడంలో హనుమంతరావు ముందుంటారని, క్రీడలను ప్రోత్సహించడంలో తమ ప్రభుత్వం ముందుంటుందన్నారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ యువత చదువులతోపాటు క్రీడలలో కూడా రాణించాలనే ఉద్దేశ్యంతోనే ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ శంబుల శ్రీకాంత్‌గౌడ్, అధ్యక్షుడు సయ్యద్ సాధిక్‌భాషా, కార్యదర్శి అమరిత్ కుమార్, ఆది అవినాష్, రజనీకాంత్, పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, బొల్లు కిషన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిత్, జ్ఞానేశ్వర్‌గౌడ్, దిడ్డి రాంబాబు, పులి జగన్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **Rasuri Surender** S/o Rasuri Mallaiah R/o 2-4-240/A/2, Nehru Nagar, Kachiguda, Hyderabad-500027, have changed my minor daughter's name about 5 years, from Rasuri Nithusha to **Rasuri Veda Smrta Poojitha.**
**(Ro.No.45233)**

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహనగర పాలక సంస్థ
GHMC
టెండర్ ప్రకటన (ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)
నిట్ నెం.37/EE/GHMC/DIV-21/2023-24, తేది: 18.01.2024, పై నిట్ ప్రకారం (ఐటమ్ నం.01 నుండి 11కు) 11 పనుల అంచనా ధర: రూ.236.95 లక్షలతో టెండర్లు పిలువబడుతున్నవి. బిడ్స్ యొక్క విక్రయం వెబ్‌సైట్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌పై 20.01.2024న మ.12.00 గం. నుండి తెరువబడును. బిడ్స్ దాఖలుకు చివరి తేది: 27.01.2024 మ.12.00 గం. వద్ద. దాఖలు సమయానికి ఒక గంట ముందుగా బిడ్స్ విక్రయం ముగించబడును. తదుపరి వివరాలు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in పై చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ డివిజన్-21, SLP జోన్, GHMC
DIPR.No.9535-PP/CL/Advt/1/2023-24, తేది: 18.01.2024

IN THE COURT OF THE HON'BLE
IV ADDL JUNIOR CIVIL JUDGE
R.R.DISTRICT : AT : L.B.NAGAR
O. S. No. 27 of 2024
Between:
1. **Smt. R.Vijaya Lakshmi And another ...Plaintiffs**
AND
1. **The Tahsildar,** Saroornagar Mandal.
2. **All concerned ...Defendants**
Please take notice that the above named plaintiff has filed the above suit against Defendents for Declaration as legal heirs and successors of deceased late R. Vasu in respect of the suit schedule property. All that the part and parcel. Flat bearing No.4 (104), Ground Floor, having plinth area of 920 Sq.feets (including common area) having undivided share of land admeasuring 30 sq.yds, covered by Plot Nos.40 and 41 in Sy.No.2, of SIRI SAI RESIDENCY, Ward No.10, Block No.6, Sainagar Colony, Situated at Lingojiguda Village, Saroornagar Mandal (Hereinafter referred to as **SCHEDULE PROPERTY.**
**Bounded by:**
NORTH: Plot No. 38 and 39
SOUTH: 20 feet wide road
EAST: Plot No.42 and Part of Plot No.37
WEST: 30 feet wide Road
The same is posted to **12 -02-2024 at 10.30 A.M.** for your appearance if any of you have any objections, claim, title or interest over the suit schedule property you may appear before the above mentioned court on 12-02-2024 at 10.30 A.M either in person or through counsel, failing which the matter will be decided as per law, the Hon'ble court will proceed with the matter in your absence.
(BY ORDER OF THE COURT)
**Sd/- R. RAJENDER-Advocate**
20-84, Kodandaramnagar, Hyd-60.
**Cell No: 9849351084**

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది మరియు ప్రకటించునది ఏమనగా మా క్లైంట్‌లు రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ మండలం, గోసాయిగూడ గ్రామం వద్ద ఉన్న సర్వే నం.14, 14/3, 14/4, 14/5లోని ఎక.2-00 గుంటలు (ఎక.4-31 గుంటలలోని) విస్తీర్ణం వ్యవసాయ భూమి మొత్తం అదంతా కలిగిన ఆస్తిని దాని చట్టబద్దమైన యజమానులు **1) ఎనిగళ్ల వెంకట రవీంద్ర, 2) శ్రీమతి యర్రం లక్ష్మి, 3) గవర ఉదయ శ్రీనివాసు & 4) వంశీ కృష్ణారెడ్డి నందిపాటి** వారి నుండి విలువైన విక్రయ పరిగణనతో కొనుగోలుకు ఉద్దేశించినారని ఇందు మూలముగా ప్రకటించడమైనది.
ఏ వ్యక్తి(లు) పైన పేర్కొన్న ఆస్తులకు సంబంధించి ఏ హక్కు టైటిల్ లేదా ఆసక్తి ఉన్నట్లయితే వారి అభ్యంతరాలను ఈ ప్రచురణ యొక్క తేదీ నుండి 7 రోజులలోపుగా తెలియజేయవలెను. లేదా మా క్లైంట్ అప్షన్ ప్రకారం ఆ విధంగా లావాదేవీలు పూర్తి చేయబడతాయి. ఆపై తర్వాత వచ్చిన ఏవైనా అభ్యంతరాలు రద్దు చేయబడినట్టు పరిగణించబడతాయి.
**అక్షత్ సంఘీ & ప్రణీతా సంఘీ**
**న్యాయవాదులు**
ఫ్లాట్ నం.302, వన్స్ టవర్స్, 3వ అంతస్తు, మహేష్‌నగర్ కాలనీ, చిరాగ్ అలీ లేన్, హైదరాబాద్-500001
సెల్ నం: 09963 102934
ఇ-మెయిల్: akshatsanghi@gmail.com

## ఎల్‌బినగర్ జోనల్ పరిధిలో 2,42,579 ప్రజా పాలన దరఖాస్తులు

### పకడ్బందీగా పూర్తి చేసిన ప్రజాపాలన డేటా ఎంట్రీ



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ పంకజ

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఎల్‌బినగర్ జోనల్ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిలించి డేటా ఎంట్రీని పూర్తి చేశారు. ఎల్‌బినగర్ జోనల్ పరిధిలో ప్రజాపాలనలో మొత్తం ఐదు సర్కిలలో 2,42,579 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన అధికారులు డేటా ఎంట్రీ చేసే ప్రక్రియను పూర్తి చేసినట్లు ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. ఐదు గ్యారంటీలకు సంబంధించి కాప్రా సర్కిల్ పరిధిలో 62,743, ఉప్పల్ సర్కిల్‌పరిధిలో 50,588, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో 48,785, ఎల్‌బినగర్ సర్కిల్ పరిధిలో 40,765, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 39,698 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి డేటా ఎంట్రీ ప్రక్రియను కూడా పూర్తి చేయడం జరిగిందని వివరించారు. ఐదు గ్యారంటీలతో పాటు అదనంగా నూతన రేషన్ కార్డుల కోసం 81,641 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుల పరిశీలన విషయంలో తప్పులు దొర్లకుండా అధికారులు దగ్గరుండి డేటా ఎంట్రీ ప్రక్రియ కార్యక్రమాన్ని పూర్తి చేశారని పంకజ తెలిపారు.

## ఆలయన్ని శుభ్రం చేసిన మాజీ ఎంపి చాడ



ఆంజనేయస్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న మాజీ ఎంపి చాడ సురేష్‌రెడ్డి

**నేరేడ్‌మెట్, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గురువారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ ఆంజ నేయ స్వామి ఆలయాన్ని మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి స్థానిక నాయకులతో కలసి శుభ్రంచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న వివిద హిందూ దేవాలయాలను సందర్శించి శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంలో భాగంగా సీతారాముల ప్రాణ ప్రతిష్ట ఈ నెల 22వ తేదీనా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామ మందిర నిర్మాణం దేశ ప్రజలు గర్వించదగ్గ ఘట్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్, వెంకటేష్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని జెడ్‌సికి కార్పోరేటర్ వినతి



జోనల్ కమీషనర్ పంకజకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పోరేటర్ శాంతిశేఖర్

**నాచారం, జనవరి 18 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లో ఎన్నికల కోడ్ కారణంగా ఆయా ప్రాంతాల్లో నిలిచిపోయి పెండింగ్ పనులకు వెంటనే నిధులు కెటాయించాలని ఎల్‌బీనగర్ జోనల్ కమీషనర్ పంకజకు స్థానిక కార్పోరేటర్ వినతిపత్రాన్ని అందజేశారు. మంజూరైన పనులకు ఎన్నికల కోడ్ కరణంగా టెండర్లు కాలేదని అలాంటి పనులకు టెండర్లు వేయించాలని, సీసీ రోడ్లకు నిధులు కెటాయించాలని కార్పోరేటర్ జెడ్‌సీని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్ అభయాంజనేయ స్వామి ఆలయానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డిని సన్మానిస్తున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి : చిత్రంలో అమృతానాయుడు తదితరులు (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

## పారిశుద్ధ కార్మికులు నిర్లక్ష్యం వీడాలి : బద్దం



కాలనీవాసులతో మాట్లాడుతున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** పారిశుద్ధ కార్మికులు విధి నిర్వహణ పట్ల నిరీక్షణ విడాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కమలానగర్‌కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ బుధవారం కాలనీలో పర్యటించగా స్వచ్ఛ ఆటో కార్మికులు రాకపోవడం వల్ల కాలనీలో చెత్తా పేరుకు పోతుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆటో కార్మికులు రాకపోవడంతో చెత్తాచెదారం పేరుకు పోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోవడంతో కాలనీ వాసుల నుండి ఫిర్యాదులు వస్తున్నయని, ఈ విషయమై ఉపకమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్య, యాకయ్య, కాలనీవాసులు ఇటికాల సత్యనారాయణరెడ్డి, సివి.సత్యనారాయణ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సేవలందించేందుకు రవాణా శాఖలో సమగ్ర మార్పులు : మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

## ఆర్టీఓ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే మల్‌రెడ్డి

**తుర్కయాంజాల్, జనవరి 18 ప్రభాతవార్త :** ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర రవాణా శాఖలో ప్రక్షాళనను చేపట్టి సమగ్ర మార్పులు చేయనున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంస్థ ద్వారా సేవలందించాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకెళ్తోందన్నారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ ప్రాంతంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ. 2.15 కోట్ల సి.ఎస్.ఆర్ నిధులను వెచ్చిస్తూ రామోజీ ఫౌండేషన్ నూతనంగా నిర్మించిన ఆర్టీవో కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి గురువారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానాటికి విస్తరిస్తున్న నేటి సమాజంలో సగటు మనిషి జీవితంతో పోలిస్తే, వాహనాల సంఖ్య అత్యంత వేగంగా పెరుగుతోందన్నారు. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగానే రోడ్డు భద్రత అంశాన్ని కూడా ప్రతిఒక్కరు అంతర్భాగంగా మల్చుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. లేనిపక్షంలో ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారం ఉంటుందన్నారు. ప్రయాణం ఎంత అవసరమో, భద్రత కూడా అంతే ముఖ్యమని మంత్రి నొక్కి చెప్పారు. రవాణా శాఖ ద్వారా ప్రతి పౌరుడికి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ ఇత్యాదిరూపాల్లో మెరుగైన సేవలందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇప్పటికే కంప్యూటరీకరించబడిన 59 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు వారి ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించేలా సమగ్ర మార్పులు తెస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ ద్వారా 1526 కోట్ల రెవెన్యూ సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫౌండేషన్ ప్రతినిధి విజయేశ్వరి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అనితహరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, బోగారపు దయానంద్, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, జిల్లా రవాణా శాఖ అధికారి ప్రవీణ్‌రావు, స్థానిక రవాణా శాఖ అధికారి రఘునందన్‌గౌడ్,



ఆర్టీఓ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం , ఎమ్మెల్యే మల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక తదితరులు

మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ మున్సిపల్ చైర్ పర్సన్ హరితధన్‌రాజ్‌గౌడ్, ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, కాకుమాను సునీల్, కొత్తకుర్మా మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు మర్రి మాధవి మహేందర్ రెడ్డి, కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, రేవెల్లి హరిత యాదగిరి, మేతరి అనురాధ దర్శన్, కవిత శేఖర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ...** మన్నెగూడ పరిధిలోని ఆర్టీఓ కార్యాలయం ఓపెనింగ్ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా గురువారం క్యాలెండర్ ఆవిష్కరణ చేసారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు, పల్లపు విఘ్నేశ్, దేరంగుల రామకృష్ణ, కొమ్మరాజుల శ్రీనివాస్, గండికోట సత్యం, నర్ర పాండు, వరికుప్పల సుధాకర్, దేరంగుల బాలకృష్ణ, బాయ్ ముత్క శ్రీనివాస్, చంద్రసేన్. నర్ర శ్రీధర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎన్టీఆర్ చిత్రపటం వద్దనివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** తనకు రెండవసారి రాజకీయ పునర్జన్మనిచ్చింది తెలుగుదేశం పార్టీయేనని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా లింగోజిగూడ డివిజన్ సాయినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి నందమూరి తారకరామారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు,చిత్తలూరి వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ యాదవ్, అనంతుల రాజిరెడ్డి, బోడ బిక్షపతి, బేర బాలకిషన్, వరప్రసాద్ రెడ్డి, తిలక్‌రావు, నర్రె శ్రీనివాస్, మధుసాగర్,ఇంద్రాజీ, సత్యనారాయణ, పార్వతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలను శుభ్రం చేసేందుకు కృషి చేయాలి : మాజీ ఎమ్మెల్యే రాంచందర్‌రావు



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాంచందర్‌రావు, సారంగపాణి

**తార్నాక, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రజలు ఆలయాలను శుభ్రం చేసేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, సికింద్రాబాద్ కంటెస్టడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్రమోది పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని తార్నాక గణేష్ టెంపుల్లో బిజేపీ శ్రేణులు చేపట్టారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు, సారంగపాణి, డివిజన్ అధ్యక్షులు రాము‌వర్మతో కలిసి ఆలయం, పరిసరాలను మంచినీటితో శుభ్రం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం అయోధ్యరామ మందిరం దర్శణం కోసం ఆహ్వాన పత్రికలను పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధి సుబ్బారావు, బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రకాష్‌గౌడ్, జిల్లా కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, రాముపర్మ, వెంకటేష్ గౌడ్, జమ్మికుంట వేణు,శ్రీనివాస్ చారి, దేవుడు కుమార్, ప్రమోద్, భిక్షపతి, కృష్ణగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నందమూరి సుహాసిని, జి.శరత్

**ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త :** ఉప్పల్‌నియోజకవర్గం చిలుకానగర్ చౌరస్తాలో గూడపాటి ఫౌండేషన్ చైర్మన్ గూడపాటి శరత్ ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి టిడిపి మహిళా నేత నందమూరి సుహాసిని ముఖ్యఅతిధిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనికోరారు. తెలుగువారి ఆత్మాభిమానం కాపాడేందుకు ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. టిడిపి హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని, తెలంగాణలో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చరిత్రలో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.గూడపాటి ఫౌండేషన్ చైర్మన్ గూడపాటి శరత్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు డాక్టర్ కార్తీక్ దేశాయ్, టిడిపి సీనియర్ నేత పబ్బతి శేఖర్‌రెడ్డి. బజారు హేమంత్‌గౌడ్, ఇమాంసాబ్, రాగి వెంకట్‌రెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## పేదలపాలిట ప్రత్యక్ష దైవం ఎమ్మెల్యే బిఎల్ఆర్



ఎమ్మెల్యేకు స్వామివారి రక్షణ అందిస్తున్న గురుస్వామి బైరి భాస్కర్ గౌడ్ బృందం

**కుషాయిగూడ, జనవరి 18 ప్రభాతవార్త :** విద్య వైద్య పరమైన సేవలను నిరుపేదలకు అందిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యక్ష దైవంగా నిలిచారని అయ్యప్ప సేవా సంస్థ సీనియర్ గురుస్వామి బైరి భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. మండల దీక్ష మకర జ్యోతి దీక్ష మకర జ్యోతి దర్శనానంతరం హైదరాబాద్ చేరుకున్న గురుస్వామి బృందం శబరిమల స్వామివారి పవిత్రమైన రక్షణ ఎమ్మెల్యేకు అందజేశారు భగవంతుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలు అందించే విధంగా స్వామి వారు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శక్తిని ప్రసాదిస్తారని గురుస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో అయోధ్య అక్షితల పంపిణి

**సరూర్‌నగర్, జనవరి 18 ప్రభాతవార్త:** అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం జరుగుతున్న నేపథ్యంలో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పవిత్రమైన ఆ ప్రదేశంలో పూజలు చేసిన అక్షింతలను మీర్‌పేట్ కార్పొరేషన్ శివసాయినగర్ కాలనీలో పంపిణీ చేశారు. శ్రీ గౌరీనీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో పూజలు చేసిన అనంతరం ఆలయ కమిటీ సభ్యుడు వెంకట కృష్ణారెడ్డి తదితరులు కాలనీలో ఇంటింటికి తిరిగి అక్షితలను కాలనీవాసులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సంతోష్‌రెడ్డి, గంగా రామకృష్ణ, ప్రధాన అర్చకుడు లక్ష్మీ గణపతిరావు, మహిళలు మీనాక్షి, లక్ష్మి, సుశీల, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంకు యూత్ కాంగ్రెస్ నేతల సన్మానం

**సరూర్‌నగర్, జనవరి 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి వచ్చిన పొన్నం ప్రభాకర్‌కు మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు సా ్వగతం పలికి సన్మానించారు. మన్నెగూడలో ఆర్టీఎ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన పొన్నంను మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కలిసి శాలువాతో సనా ్మనించారు. ఈ కార్యక్రమంలో దిండు శ్రీనివాస్‌గౌడ్, సామ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పూజలు

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దంపతులు గురువారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ వేద పండితులు, అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కార్య నిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరికీ యోగా అవసరం : ఉప్పల



యోగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి ధ్యానమండలి నిర్వాహకుడు బిక్షమయ్య గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణా తరగతులు ఈ నెల 21నుండి ఆర్కేపురం డివిజన్ చిత్రాలేఅవుట్, 23న పద్మపాణి ఆచార్య కమ్యూనిటీహాల్ హస్తినాపురం, 25న లోటస్‌ల్యాప్ పబ్లిక్‌స్కూల్ దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ శిక్షణా తరగతుల గోడపత్రికను ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నాగోల్‌లోని ఉప్పల కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యానికి మించినటువంటి సంపద మరొకటి లేదనీ అటువంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మన భారతీయ ఋషులు అందించిన గొప్ప జీవన విధానం యోగ సాధన అన్నారు. ఈ యోగ సాధనతో మనిషి ఎటువంటి అనారోగ్యం లేకుండా ఆరోగ్యంగా జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్నటువంటి ప్రతిఒక్కరికి ఇది ఒక గొప్ప ఔషధమని పేర్కొన్నారు. యోగ సాధన అనేది తన వ్యక్తిగత జీవితంలో ప్రతిరోజు వ్యాయామం పూర్తయిన తర్వాత ప్రాణాయామ సాధన పద్ధతుల చేత తన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. ఈ యోగ శిక్షణా తరగతులను పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు ప్రముఖ యోగాగురువు, యోగ రత్న అవార్డు గ్రహీత ఇస్మాయిల్ గురూజీ తెలియజేశారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి అబ్యుదయ సంఘం భావన శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ఫౌండేషన్ రామచంద్ర రావు, తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బూర మల్సూర్ గౌడ్, యోగ మాస్టర్ శ్రీనివాసులు, నరేందర్‌గురూజీ, పొనగాని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలాలి ఉర్సు ఉత్సవాలు : మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



ఉర్సు ఉత్సవాలకు వసతులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ముస్లీం మత పెద్దలు

**మల్కాజిగిరి, జనవరి 18 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని మౌలాలి డివిజన్ గుట్ట చుట్టుపక్కల బస్తీలలో స్థానిక అధికారులతో కలసి పర్యటించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 24 నుండి 31 వరకు మౌలాలి ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మౌలాలి గుట్ట పరిశుభ్రంగా ఉంచాలని, మంచి నీరు అందించాలని, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచాలని, వాటితోపాటు మొబైల్ టాయిలెట్‌లు కూడా ఏర్పాటు, రాత్రిపూట లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. మౌలాలి ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతోపాటు జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ రాజు, ఈఈ లక్ష్మణ్, టౌన్ ప్లానింగ్ తుల్జా సింగ్, ఏఈ మధురిమ, ఎలక్ట్రికల్ వెంకటేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అమీనుద్దీన్, బద్దం పరశురాంరెడ్డి, నవాబ్, ఇబ్రహీం, సత్తయ్య, గణేష్, మహేష్, సందీప్, నర్సింగ్‌రావు, ఆది, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కార్పొరేటర్ కొత్తకాపు అరుణ



దరఖాస్తులను అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** ఆసరా పథకాన్ని సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. రెవిన్యూబోర్డు కాలనీలో సీనియర్ సిటిజన్స్‌కు ఆసరా పథకానికి సంబంధించిన దరఖాస్తులను పంపిణీ చేసిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఆసరా పథకంలో నమోదు చేసుకోవడం ద్వారా సీనియర్ సిటిజన్స్‌కు లబ్ది చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహా, శ్రీధర్ రెడ్డి, వరప్రసాద్, ప్రజీత్, వనజ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షికి యెల్మేటి సన్మానం



దీపాదాస్ మున్షీని సన్మానిస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా ఇటీవల నియమితులై బాధ్యతలు చేపట్టిన కేంద్ర మాజీ మంత్రి దీపాదాస్ మున్షీని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన టిపిసిసి కార్యదర్శి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి సన్మానించారు. గురువారం ఆయన జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అహ్మద్ బామ్‌తో కలిసి నగరంలోని మున్షీ నివాసానికి తరలివెళ్ళిన అమరేందర్‌రెడ్డి ఆమెను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జిగా దీపా దాస్ మున్షీ రాకను స్వాగతించామని స్పష్టం చేశారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : అబ్రార్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 18 ప్రభాతవార్త :** అజంపుర డివిజన్‌లో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని టర్జన్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న ఓపెన్ జిమ్, పార్క్ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆయన సూచించారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్, నాయకులు ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.



దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వికలాంగుల సంక్షేమ శాఖ మాజీ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, చౌకి రవికుమార్, శివ, రాజేష్‌పటేల్, విజయ్‌కుమార్ తదితరులు (ప్రభాతవార్త: మలక్‌పేట)